మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కించుకుంటాం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ మున్సిపాలిటీ చైర్మన్ పీఠం దక్కించుకుని త్వరలో మున్సిపల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కాంగ్రెస్ కౌన్సిలర్ చాప రాజు అన్నారు. రెండు రోజుల్లో చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టనున్నట్లు తెలిపారు. అవిశ్వాసానికి పార్లమెంట్ ఎన్నికల కోడ్ అడ్డుకాదని, ఇటీవల జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మేయర్ ఎన్నిక జరిగిందన్నారు. వ్యతిరేక కౌన్సిలర్లను కలుపుకుని అవిశ్వాసం పెట్టడంతో పాటు కాంగ్రెస్ అభ్యర్థిని చైర్‌పర్సన్‌గా నెగ్గించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

గృహిణి అదృశ్యం

అల్వాల్: గృహిణి అదృశ్యమైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై సైదులు తెలిపిన వివరాలు.. నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీబీఎస్ కాలనీ బీ-బ్లాక్‌లో కేతావత్ శివ(23), అంజలి(21) దంపతులు నివసిస్తున్నారు. ఈ నెల 17వ తేదీ రాత్రి ఇంట్లో ఇద్దరూ నిద్రిస్తుండగా.. అంజలి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా అంజలి ఆచూకీ లభించకపోవడంతో శివ సోమవారం నేరేడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలోనూ అంజలి ఇలాగే వెళ్లి వారం రోజుల తర్వాత ఇంటికి వచ్చిందని శివ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఇంటి వద్దే ఓటు వేసేలా..

వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం



- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 41,236 మంది వృద్ధులు, దివ్యాంగులు
- ఇంటింటికీ వెళ్లి వారికి దరఖాస్తులు అందజేస్తున్న బీఎల్‌ఓలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఓటు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవడం ద్వారా పోలింగ్ శాతం పెంచేలా ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా వయోవృద్ధులు, దివ్యాంగులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీరికి ఎన్నికల సంఘం ప్రత్యేకంగా వాహనాలు ఏర్పాటు చేసినా.. సరిపోవడం లేదు. దీనికి తోడు శారీరక, మానసిక ఇబ్బందుల నేపథ్యంలో మరి కొందరు ఓటు వేసేందుకు సుముఖత చూపడం లేదు. దీంతో ఓటింగ్ శాతం తగ్గుతోంది. ఈ నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు ఓటును వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో నడవలేని వారు ఇంటి వద్ద నుంచే ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో 80 ఏళ్లు దాటిన వృద్ధులకు, 40 శాతానికి పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే విధానాన్ని అమలు చేసింది. తొలిసారి మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో వేలల్లో అర్హులు ఉండగా.. అవగాహన లేక కొంత మంది మాత్రమే ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారు. అయితే.. ఈ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం ఇంటి నుంచి ఓటు హక్కును వినియోగించుకునే వయోవృద్ధుల వయస్సును 80 ఏళ్ల నుంచి 85 ఏళ్లకు పెంచింది. దివ్యాంగులకు మాత్రం గత విధానాన్నే కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లాలో అధికార యంత్రాంగం గుర్తించిన 41,236 మంది వయో వృద్ధులు, దివ్యాంగులకు బీఎల్‌ఓల ద్వారా 12(డీ) దరఖాస్తులను పంపిణీ చేస్తోంది. ఇందులో 85 ఏళ్లు దాటిన వృద్ధులు 15,117 మంది ఉండగా, దివ్యాంగులు 26,119 మంది ఉన్నారు.

కర్ణాటక బాటలో..

వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకోలేక పోతున్నారని భావించిన ఎన్నికల సంఘం కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఇంటి వద్దే వారంతా ఓటేసేలా చర్యలు చేపట్టింది. ఈ విధానం సత్ఫలితాలను ఇవ్వడంతో.. గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో ఈ నూతన విధానాన్ని అమలు చేసింది. సరైన అవగాహన లేక కొంత మంది మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. ఈసారి అలాంటి పరిస్థితి తలెత్తవద్దని ముందస్తుగానే అర్హులను గుర్తించిన జిల్లా అధికార యంత్రాంగం ఇప్పటి నుంచే బీఎల్‌ఓల ద్వారా ఇంటింటికీ వెళ్లి వయో వృద్ధులు, దివ్యాంగులకు 12(డీ) దరఖాస్తులను పంపిణీ చేయిస్తున్నారు.

వీరంతా ముందే ఓటేస్తారు..

ఇంటి వద్ద నుంచి ఓటు వేయటానికి 12(డి) కింద దరఖాస్తు చేసుకున్న వయోవృద్ధులు, దివ్యాంగులు పోలింగ్‌కు మూడు రోజుల ముందే ఓటేసే అవకాశం కల్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించనుంది. ఇంట్లోనే కంపార్టుమెంట్‌ను ఏర్పాటు చేసి పోలింగ్ ఆఫీసర్, స్థానిక బీఎల్‌ఓ, పోలీసులతో కూడిన బృందం ఈవీఎంతో వెళ్లి ఓటు వేయిస్తారు. ఈ ప్రక్రియనంతా వీడియో ద్వారా చిత్రీకరిస్తారు. బ్యాలెట్ ముద్రించిన తర్వాత ఈ ప్రక్రియను వేగవంతం చేస్తారు. ప్రస్తుతం బీఎల్‌ఏలు గుర్తించిన వయోవృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి దరఖాస్తులు అందజేస్తున్నారు. అర్హులైన వారు ఉంటే.. బీఎల్‌ఓ సంప్రదించి సంబంధిత 12(డీ)దరఖాస్తును పొంది.. వారికి అందించవచ్చని జిల్లా అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

వాహనంలో తరలిస్తున్న రూ.3 లక్షలు స్వాధీనం



ఘట్‌కేసర్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సైదులు, ఎస్సైలు

ఘట్‌కేసర్: ఎన్నికల కమిషన్ ఆదేశం మేరకు పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఐ సైదులు ఆధ్వర్యంలో మంగళవారం తనకీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహనంలో తరలిస్తున్న రూ.3 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రకారం రూ.50 వేలకు మించి వెంట ఉంచుకోరాదని, నిబంధన ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

2.5 కిలోల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడ్డ యువకులు

మేడ్చల్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులను మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కోల్ నీలేష్(28), వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సోను కుమార్ ప్రసాద్(21) కొంత కాలంగా మేడ్చల్ మండలంలోని రాజబొల్లారం గ్రామంలో నివాసముంటూ మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో కార్మికులకు గంజాయి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మేడ్చల్ ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 2.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఒడిశా నుంచి గంజాయి తీసుకువచ్చి మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో కూలీ పనిచేసే కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై సోదరుడితో దాడి చేయించిన భార్య

ఘట్‌కేసర్: కుమారుడిని చూసేందుకు ఇంటికొచ్చిన భర్తను తన సోదరుడితో భార్య దాడి చేయించిన ఘటన ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్‌లో జరిగింది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మౌలాలికి చెందిన భూక్య పవన్(28), ఇస్లావత్ కవితతో 2018లో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో 2023లో విడాకుల కోసం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆదివారం రాత్రి తన కుమారుడిని చూసేందుకు పవన్ కొండాపూర్‌లోని భార్య కవిత ఇంటికి వెళ్లాడు. అదే సమయంలో కవిత తన సోదరుడు రామ్‌మూర్తితో కలిసి పవన్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ క్రరతో దాడి చేశారు. ఈ విషయమై భార్య, బావమరిదిపై పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వీధి కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి



ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో వీధి కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెలకు కాపలాగా ఎవరూ లేకపోవడంతో సోమవారం రాత్రి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. దీంతో గ్రామానికి చెందిన మెట్టు రమేశ్‌కు చెందిన 15 గొర్రెలు మృతి చెందగా మరో 15 గొర్రెలకు గాయాలయ్యాయి. వాటి మృతితో రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

చిన్నారులకు ఉచిత వైద్య పరీక్షలు

కుషాయిగూడ: చిన్న చర్లపల్లిలోని గడ్డ యాదగిరి ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కాప్రా, ఏఎస్‌రావునగర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 150 మంది చిన్నారులకు కంటి, దంత, బీపీ, సుగర్ పరీక్షలతో పాటు సాధారణ టెస్టులు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ హేమంత్, క్లబ్ ప్రతినిధులు, నాయకులు విజయ్‌కుమార్, వరప్రసాద్, చందన్‌రాజ్, సురేశ్, హరి, గోపాల్, శ్రీదేవి, నాగన్న, సత్తిరెడ్డి, భిక్షపతి, రవికుమార్ పాల్గొన్నారు.

సూపర్ మార్కెట్లలో డిప్యూటీ కమిషనర్ తనిఖీలు

అల్వాల్: సర్కిల్ పరిధిలోని పలు సూపర్ మార్కెట్లలో మంగళవారం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పలు సూపర్ మార్కెట్లలో గడువు తేదీ దాటినా వస్తువులు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో తనిఖీలు చేపట్టామన్నారు. గడువు దాటిన వస్తువులను తీసివేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

జేబీ బిల్డర్స్‌పై బాధితుల ఫిర్యాదు

ఉప్పల్: జేబీ బిల్డర్స్ బాధితులు ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. స్థిరాస్తి వ్యాపార సంస్థ జేబీ బిల్డర్స్ బిచాణా ఎత్తివేసిందన్న వార్త ప్రధాన దిన పత్రికల్లో ప్రచురితం కావడంతో బాధితులంతా మంగళవారం ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. దాదాపు వందమంది బాధితులు, వినియోగదారులు, ఏజెంట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, జేబీ బిల్డర్ బిచాణా ఎత్తివేసిన ఘటనలో ముమ్మర దర్యాప్తు ప్రారంభించినట్లు ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే రెండు బృందాలను రంగంలోకి దించామన్నారు.

శ్రామికనగర్ కాలనీ అభివృద్ధికి సహకరిస్తా

మౌలాలి: శ్రామికనగర్ కాలనీ అభివృద్ధికి సహకరిస్తానని మౌలాలి కార్పొరేటర్ సునీతా శేఖర్‌యాదవ్ అన్నారు. మంగళవారం శ్రామికనగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని కార్పొరేటర్ సత్కరించారు. అనంతరం కార్పొరేటర్ సునీత మాట్లాడుతూ.. కాలనీలో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. శ్రామిక నగర్‌కాలనీ అధ్యక్షుడు గౌసిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'రాగిడి'ని భారీ మెజారిటీతో గెలిపిద్దాం

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు కృషి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని జీకే సరస్వతి ఫంక్షన్ హాల్లో పార్టీ శ్రేణులతో సమావేశం జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబిత అనిల్ కిషోర్, మేకల సునీత రాము యాదవ్, కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డి, ఏకే మురుగేశ్, మాజీ కార్పొరేటర్లు జగదీశ్ గౌడ్, ఆకుల నర్సింగ్‌రావు, నాయకులు రావుల అంజయ్య, బద్దం పరుశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, నేమూరి శ్రీధర్ గౌడ్, జీకే హన్మంతరావు, అమీనుద్దీన్, మధుసూదన్‌రెడ్డి, కరమ్‌చంద్, ఢిల్లీ పరమేశ్, గోలి రమేశ్, చిదం శ్రీనివాస్, ఉస్మాన్, ఇబ్రహీం పాల్గొన్నారు.



ఫంక్షన్ హాల్లో సమావేశమైన ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు

పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యం విద్యార్థుల్లో లేదు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపక డైరెక్టర్ దేశాయ్



ఏయూ సదస్సులో రిజిస్ట్రార్ యూబీ దేశాయ్‌తో ఎంబీఏ విద్యార్థులు

ఘట్‌కేసర్: పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్యం, విద్యార్థులు కలిగి ఉన్న జ్ఞానానికి మధ్య విస్తృత అంతరం ఉందని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపక డైరెక్టర్, అనురాగ్ యూనివర్సిటీ (ఏయూ) చాన్స్‌లర్ యూబీ దేశాయ్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఎంబీఏ బిజినెస్ అనాలిటిక్స్ ఇండస్ట్రియల్ ఇమ్మర్సీవ్ ప్రోగ్రామ్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా మంగళవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాడెమియా, పరిశ్రమలు పరస్పరం ఆధారపడి ఉన్నాయని, దీన్ని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచి ఫలితాలు ఉంటాయని అన్నారు. ఏయూ రిజిస్ట్రార్ బా లాజీ ఉట్ల, సీఈఓ నీలిమా, ప్రొఫెసర్లు వేణుగోపాల్, స య్యద్ మన్సూర్ పాషా, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విభా గాధిపతి విష్ణు వందన, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

జల్సాల కోసం బైకుల చోరీలు

- ఆరు బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు



దొంగిలించిన బైకులతో నిందితుడు సాగర్

కీసర: జల్సాల కోసం బైక్ చోరీలు చేసిన వ్యక్తిని కీసర పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సీఐ వెంకటయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలోని వీరారెడ్డిపల్లికి చెందిన ఎ.సాయిసాగర్(23) స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పని చేస్తూ రాంపల్లిలోని ఆర్‌ఎల్ నగర్‌లో ఉంటున్నాడు. ఇతను తన చిన్ననాటి స్నేహితుడు సాయిరాహుల్‌తో కలిసి తాగుడు, ఆన్‌లైన్ గేమ్స్ వంటి దురలవాట్లతో పాటు జల్సాలకు అలవాటుపడ్డాడు. అతడికి నెలవారీ వచ్చే ఆదాయం చాలకపోవడంతో ఉప్పల్, భువనగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో బైక్ దొంగతనాలు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో భువనగిరి పోలీసులు సాగర్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చినప్పటికీ అతడి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఇతడిపై రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్లలో 6 కేసులు నమోదయ్యాయి. మంగళవారం రాంపల్లిలోని మారుతి గార్డెన్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా సాగర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా గతంలో అతడిపై నమోదైన కేసుల వివరాలు తెలిశాయి. నిందితుడు వద్ద దొంగిలించిన ఆరు బైకులు ఉన్నాయి. వీటితో పాటు తన సొంత పల్సర్ బైక్, సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకుని, అతడిని అరెస్ట్ చేశారు.

రిసెప్షన్‌కు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ



పగులగొట్టి ఉన్న బీరువా తాళం

మేడ్చల్‌రూరల్: కన్న కూతురి రిసెప్షన్‌కి వెళ్లి వచ్చేసరికి ఇంట్లో నగలు అపహరణకు గురైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్ గ్రామానికి చెందిన రమేశ్ ఇంట్లో గత ఆదివారం కూతురు వివాహం జరగ్గా సోమవారం రాత్రి మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేయడంతో కుటుంబ సభ్యులు, బంధులు ఇంటికి తాళం వేసి విందుకు వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఆభరణాలతో పాటు కొంత నగదును ఎత్తుకెళ్లారు. కుటుంబ సభ్యులు ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటం, ఇంట్లోని సామాగ్రి చిందరవందరగా పడి ఉండటంతో పాటు బీరువాలో ఆభరణాలు కనిపించకపోవడంతో దొంగలు చొరబడినట్లు గుర్తించి మేడ్చల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, క్లూస్‌టీం ఘటనా స్థలిని పరిశీలించి పలు ఆధారాలు సేకరించారు. బీరువాలో ఉన్న 4 తులాల బంగారం, 60 తులాల వెండి, కొంత నగదు చోరీకి గురైనట్లు రమేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

శుభాకాంక్షల వెల్లువ

మేడ్చల్‌రూరల్: మాజీ మంతిర, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి వివాహ వార్షికోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గుండ్లపోచంపల్లి, మేడ్చల్ మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లు, నాయకులు, మేడ్చల్ ఎంపీపీ, మండల నాయకులు నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి మల్లారెడ్డి దంపతులతో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిత, మాజీ సర్పంచులు రాజమల్లారెడ్డి, మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ప్రభాకర్, రమేశ్, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బాలరాజు, హేమంత్‌రెడ్డి, పెంటయ్య, జంగ హరిక్రిష్ణ, దేవ, బీఆర్‌ఎస్ నాయకులు భాగ్యారెడ్డి, యూనిస్‌పాషా, నరేందర్, రవీందర్‌రెడ్డి, నిశిత, సత్తిరెడ్డి, జానార్దన్‌రెడ్డి, శ్రీహరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న మేడ్చల్ ఎంపీపీ, నాయకులు

కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు రైతులు సిద్ధం

- రైతులను మోసం చేసినందుకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమి తప్పదు
- బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది
- రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్

కీసర: ఎన్నికల ముందు రైతులతో పాటు అన్నివర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధిచెప్పేందుకు రైతులు, ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. కరీంగూడ గ్రామంలో మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ప్రశ్నిస్తున్న తెలంగాణ రైతు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తొమ్మిదిన్నర ఏళ్లపాటు ప్రజావ్యతిరేక పాలన చేపట్టిన బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందన్నారు. 100 రోజుల్లోపు 6 గ్యారంటీలను అమలు చేస్తామని తెలిపిన కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ, రైతు భరోసా కింద రైతులు, కౌలురైతులకు ఎందుకు ఆర్థికసాయం, వరిపంటకు 500 బోనస్ ఎందుకు అందించలేకపోతుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పాలన పట్ల విసుగుచెందిన ప్రజలు మార్పుకోరితే కాంగ్రెస్‌కు కలిసి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ కూడా బీఆర్‌ఎస్ మాదిరిగానే ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తుందన్నారు. కేసీఆర్ తమ బిడ్డల కోసం పనిచేస్తే.. రేవంత్‌రెడ్డి సోనియా గాంధీ బిడ్డల కోసం పనిచేస్తున్నారని, కానీ నరేంద్రమోదీ దేశ ప్రజలందరూ తన బిడ్డలేనని భావించి పనిచేస్తున్నారన్నారు. మీ బిడ్డల భవిష్యత్తు బాగుపడాలంటే నరేంద్ర మోదీని మళ్లీ ప్రధానమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసి ఈటల రాజేందర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిపించుకోవాలని కోరారు.

రూ.2 లక్షల రుణమాఫీ ఎలా చేస్తారు..?

మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇచ్చి దొంగదారిలో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రైతులను గోసపెడితే తగిన బుద్ధిచెబుతామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ బాగోలేదు కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేయలేకపోయాడని, ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షలు రుణమాఫీ ఎలా చేస్తారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక సీట్లలో బీజేపీ గెలుపొందడం ఖాయమన్నారు. అనంతరం ఆదర్శ రైతు కుందన్‌పల్లికి చెందిన ద్రాక్ష రత్న చింతల వెంకట్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు జి.మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు అంజయ్యయాదవ్, పి.జగన్‌మోహన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, బుద్ది శ్రీనివాస్, శోభారెడ్డి, తిరుమల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేష్, రామోజీ, మల్లేష్‌గౌడ్, బుచ్చిరెడ్డి, బోడ శ్రీనివాస్‌రావు, బాల్‌రాజ్‌యాదవ్, వంగేటి బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి



ఘట్‌కేసర్‌లో డ్రైనేజీ పనులు పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ జహంగీర్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ 13వ వార్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ జహంగీర్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ డ్రైనేజీ మురుగు నీరు, వర్షం నీరు రోడ్డుపై ప్రవహించకూడదని రూ.9 లక్షలతో డ్రైనేజీ నిర్మిస్తున్నామన్నారు. గుంతలు లేకుండా మట్టితో నింపాలని, పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రవి, మాజీ ఉప సర్పంచ్ యాదగిరి యాదవ్, సిరాజ్, రామయ్య, రాకేశ్, సన్నీ పాల్గొన్నారు.

'సంస్కృతి'లో మెగా జాబ్‌మేళా



జాబ్‌మేళాలో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న ప్రతినిధులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కొండాపూర్ సంస్కృతి పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. రిలియన్స్ జియో ఇన్ఫోకామ్, షిండర్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబొరేటరీస్, ప్రీమియం ఎనర్జీలు, తోషిబా, వాసవీ వీల్స్ ఈవీ, వరుణ్ మోటార్స్, పిపాల్ ట్రీ వెంచర్స్, టీబ్ లెస్, సీగర్ ప్రైవేట్ లిమిటెట్ కంపెనీలు జాబ్‌మేళా ప్రక్రియను చేపట్టాయి. 400 మంది ఔత్సాహిక విద్యార్థులు పాల్గొనగా 185 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థుల ఎంపికపై ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తారాసింగ్, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ శివకేశవారెడ్డి, ఉదయ కిరణ్ మాట్లాడుతూ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతోందని, జాబ్‌మేళాలో విద్యార్థుల ఎంపికలే నిదర్శనమని అన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ శ్రీరామ్‌నగర్ కాలనీలో నీటి ఎద్దడి ఉందని కాలనీవాసులు కార్పొరేటర్ మునిగాల సతీష్‌కుమార్‌కు తెలియజేయగా వెంటనే స్పందించి మంగళవారం అధికారులతో కలిసి కాలనీలో సందర్శించారు. జలమండలి అధికారులు సాయినాథ్, కౌశిక్‌తో పర్యటించి నీటి ఎద్దడి సమస్యను తెలుసుకుని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తానని, డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీ యాదవ్, విజయ, పద్మ, రాధిక, సంపత్‌కుమార్, వెంకటచారి, బాబు తదితరులు పాల్గొన్నారు.



కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ సతీష్‌కుమార్, జలమండలి అధికారులు

పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక వసతులు కల్పించాలి

ఉప్పల్: ఎన్నికల ఏర్పాట్లకు అధికారులు సన్నద్ధం కావాలని ఏఆర్వో అభిషేక్ అగస్త్యా ఐఏఎస్ సూచించారు. ఉప్పల్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అభిషేక్ మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అధికారులంతా విధిగా ప్రతి పోలింగ్ స్టేషన్‌ను సందర్శించడంతో పాటు అక్కడి వసతులను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా ర్యాంపుల ఏర్పాట్లను తనిఖీ చేయాలన్నారు. మంచినీరు, విద్యుత్, టాయిలెట్స్ లాంటివి ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. గత ఎలక్షన్‌లో ఎదురైన సవాళ్లను ఈసారి సవరించుకోవాలని అధికారులకు సూచించారు. సమావేశంలో 45 మంది సెక్టార్ అధికారులు, 12 మంది నోడల్ అధికారులు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.